వాటిద్వారా సంపాదించుకుంటున్న వాళ్లూ ఈ దేశ ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం జరుగుతోంది. "ప్రవాస భారతీయుల్లారా రండి; ఇక్కడ పెట్టుబడులు పెట్టండి!" అని మన్‌మోహన్ సింగ్ గారు ఇప్పుడు అడుగుతున్నారు గానీ నేనది ఎప్పుడో అమల్లో పెట్టేను!"

"అదంతా కావచ్చుగానీ రైలు లేటు అయినంత మాత్రం చేత ప్రభుత్వాన్ని తిట్టడమేనా?" అన్నాడు కమలనాభం.

"తిట్టడం కాదు. ఉన్నమాట అనుకుంటున్నాం. స్పెషల్ ట్రేన్ అని పేరు పెట్టుకుని నడుస్తున్న ఈ రైల్లో రైల్వే ఉద్యోగులతో కలిపి సుమారు 1200 మంది ప్రయాణం చేస్తున్నారు. ఈ బండి నాలుగు గంటలు లేటుగా విశాఖపట్నం చేరుకుంటే మొత్తం 4800 గంటల టైమ్ నష్టం. ఇలా జరిగితే ఇంకే దేశంలోనూ ఊరుకోరు. ప్రభుత్వం ఆదాయానికి కారణభూతులైన ప్రజల్ని ముష్టి వెధవల కిందా పనికిమాలిన వాళ్లకిందా జమకట్టే ప్రభుత్వ ఉద్యోగులూ ప్రజానాయకులూ ఈ దేశంలో తప్ప ప్రపంచంలో ఇంకెక్కడా ఉండరు. రైళ్లు లేటయి పన్లు పాడయిపోయాయని వేలాది మంది నిశ్శబ్దంగా కుమిలిపోతూ ఉంటే ఉద్యోగుల్లో కొందరు ఈ నాలుగ్గంటల ఓవర్‌టైమ్ చెల్లింపుకోసం ఆరాటపడుతూ ఉండడం దీంట్లో ఇంకో విశేషం!" అన్నాడు రంగాచారి.

"ఈ స్పెషల్ ట్రైన్ సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం రావడానికి ఇరవై గంటలో ఇరవై ఐదు గంటలో పడుతుంది సుమా - అని ముందే ప్రకటించుకుంటే ఇంత గొడవుండదేమో?" అన్నాను.

"అలా అన్నావు బావుంది. ఇంతకీ నువ్వు మళ్లీ హైదరాబాదు ఎప్పుడొస్తున్నావు" అని అడిగాడు కమలానాభం.

"అదే! పదకొండో తారీకున స్పెషల్ ట్రైన్ ఉందిట కదా. దానికి దొరికిందట; రిజర్వేషను!" అని నేను చెప్పగా ఆ చుట్టుపట్ల కూర్చున్న వాళ్లందరికీ ఒక్కసారిగా నవ్వొచ్చింది.

"ఝువిటో! స్పెషల్ ట్రేనంటే నవ్వులాటగా ఉంది, ప్రతీవాడికీనీ!" - అనుకున్నాను.

★

# 59. అడుగడుగున గుడివుంది

**ఓ**సారి సాయిబాబా అనే పేరుగల నా మిత్రుడొకడు నా దగ్గిర వందరూపాయలు అప్పు పట్టుకెళ్లి రెండు నెలలయిపోయినా తిరిగి ఇచ్చేడు కాదని; అతనిమీద ఒక పాత జోకు ప్రయోగించేను.

"నిన్ను చూసినప్పుడల్లా నాకు రాఘవేంద్రస్వామి జ్ఞాపకం ఒస్తాడు" అన్నాను.

"మాకిద్దరికీ పోలికలేమీ లేవే!" అని సాయిబాబా ఒక క్షణం ఆలోచించి "మన క్లాసుమేటు రాఘవేంద్ర స్వామి సంగతే కదూ, నువ్వు చెబుతున్నావు? ఓహో, తెలిసింది. నాపేరు డైరెక్టుగా దేముడిపేరే అయినట్టు అతనిది కూడా దేముడి పేరే - అందుకనా?" అన్నాడు.

"అందుక్కాదు. అతను కూడా నాకు వంద రూపాయలు బాకీవున్నాడు." అని నేను

నవ్వుతూ చెప్పేసరికి సాయిబాబాకి పశ్చాత్తాపం లాంటిది ఏదో కలిగినట్టయింది. "సాయంకాలం మీ అమ్మాయిని టైపుక్లాసు నుండి తీసుకురావడానికి మా వీధికి వస్తావు కదా; అప్పుడు మా ఇంటికి రా; నీ వంద రూపాయలూ ఇచ్చేస్తాను." అన్నాడు.

సరే; సాయంకాలం వెళితే సాయిబాబా వంద రూపాయలూ ఇచ్చేస్తాడు కదా అని ఆరోజు మా అమ్మాయి టైపుక్లాసుకి వెళ్లకపోయినాసరే ఆ వీధికి వెళ్లేను. సైకిలు రోడ్డు వారని నిలబెట్టి సాయిబాబా ఇంటి గుమ్మం ఎక్కేను. సాయిబాబా లోపలెక్కడో వుంటే అక్కడికెళ్లేను. అతను చేతిలో ఏవో కాయితాలు పెట్టుకుని ఆస్తంతా పోయినవాడి మొహం పెట్టుకుని కూచున్నాడు. నన్ను చూడగానే "మీ అమ్మాయి రాలేదా?" అన్నాడు.

"అమ్మాయి వూసెందుకులే!" అన్నాను.

"అదికాదు. మీ అమ్మాయిని టైపు క్లాసునించి పికప్ చైడానికి కదా నువ్వు రోజూ ఈవేళప్పుడు ఇటు వస్తావు!"

"రోజూ అంతే అనుకో. ఇవ్వాళ నువ్వు రమ్మన్నావుకదాని వచ్చేను."

"అవును కదూ; మరిచేపోయాను!" అని నెత్తికొట్టుకున్నాడు సాయిబాబా. "చూడు" అని చేతిలో ఉన్న కాగితాలు నాకు అందించేడు.

అది ఒక ఉత్తరం. నాలుగు పేజీలుంది. చేత్తో రాసిందే. అందుకున్న మరుక్షణం అది వాళ్ల నాన్నగారు అర్జంటుగా డబ్బు పంపమని రాసిన ఉత్తరం కాబోల్ననుకున్నాను. "ఇది అడ్డం పెట్టుకుని నా వంద రూపాయల బాకీ తీర్మానం మళ్లీ మరికొన్నాళ్లు వాయిదావేస్తాడు" అని కూడా తెలిసిపోయినంత పనైంది.

కాని ఆ ఉత్తరం వాళ్ల నాన్నగారు రాసింది కాదు. అసలా ఉత్తరం ఎవరు రాసేరో తెలీదు. కింద (అంటే నాలుగో పేజీలో కింది భాగంలో) సంతకం ఏదీ లేదు. "మీ శ్రేయోభిలాషి" అని వుంది.

ఈ శ్రేయోభిలాషి ఏమిటంటాడంటేనూ:

ఫలానా రాష్ట్రంలో ("ఆంధ్రప్రదేశ్‌కాదు" అని విడిగా బ్రాకెట్లలో చెప్పాలి; పత్రికల బాణీలో), ఫలానా గ్రామంలో ఫలానా అమ్మవారు వెలిసియున్నారు. ఆ అమ్మవారు అసలు గంధర్వ వనిత. పైలోకాల్లో ఉన్న కాలంలో ఏదో కారణం వల్ల ఆ లోకాధిపతికి ఆవిడమీద కోపం వచ్చి "నువ్వు మానవకాంతగా జన్మించెదవు గాక!" అని శాపం కలిసిన ఆర్డరు వేస్తే ఆవిడ జంబూ ద్వీపంలో, భరత ఖండంలో, గంగా గోదావరీ మహానదుల మధ్యను గల ఒక సీమలో ఒకానొక ధార్మిక, భాగ్యశాలి ఇంట జన్మించిందిట. యుక్తవయస్సు వచ్చేక సర్వాంగ సుందరిగా రూపుదిద్దుకున్న ఆమెను మరో సంపన్న కుటుంబానికి కోడలుగా పంపాలని ఆ తల్లితండ్రులు నిశ్చయించేరుట. ఈ అమ్మాయికి తాను గంధర్వ స్త్రీననీ, శాపవశాత్తు మానవిగా జన్మించాననీ మాత్రమేకాక; మానవ సంసారంలో పాత్రవహిస్తే శాపవిమోచనం కష్టమని కూడా తెలుసుట. అంచేత తల్లితండ్రులకి ఏదో చెప్పి వివాహం తప్పించుకోడమే కాక; మన కుటుంబంలో దాన ధర్మాలు ఆచారం కనుక నా సమయాన్నంతా అలాగే వినియోగిస్తానని చెప్పి ఆ ఇంటి పూర్వార్జితం, పిత్రార్జితం అంతా ధర్మంచేసి చేసి చివరికి ఆ కుటుంబానికి తినడానికి తిండీ, కట్టడానికి గుడ్డా లేకుండా చేసిందిట. "ఓసి జెష్టా!" అని ఒకనాడు తండ్రే

ఆమెని హత్య చేసేడట. ఆవిడ అసాధారణ వరప్రదాయినిగా మారి, మళ్లీ ఆ కుటుంబానికి ఐశ్వర్యం, సంపద ఇచ్చిందిట. అపకారికి ఉపకారము చేయగల ఆ తల్లికి చివరి కోరికగా తనకి ప్రతి పది ఆమడలకి ఒక గుడి కట్టించాలని కోరిందిట. ఈ కోరిక ఆ ఫలానా గ్రామం వారు తీర్చాలనుకుంటున్నారు గనుక ఈ ఉత్తరం అందినవారు ఆ గుడి నిర్మాణానికీ నిర్వహణకీ వంద రూపాయలు పంపడమే కాక; ఇలాంటి ఉత్తరాలు ఇరవై మందికి పోస్టు చెయ్యాలిట.

ఇందులో ఏది చెయ్యకపోయినా ఈ ఉత్తరం అందిన సంసారంలో కష్టాలు, పరాజయాలూ మృత్యువులూ ఖాయంగా వస్తాయనీ; చేసినవారికి సుఖాలూ, విజయాలూ, దీర్ఘాయువూ సంభవిస్తాయనీ -

"నీకిద్దామని నూరు రూపాయలు పోగుచేసేను, కాని ఇలా అవుతుందనుకోలేదు!" అన్నాడు సాయిబాబా.

"వెనకటికెవరో; నీ బాకీ తీరుద్దామనే లాటరీ టిక్కెట్టు కొన్నాను; ప్రయిజు రాగానే నేనే పట్టుకొచ్చి నీ బాకీ తీర్చేస్తాను, నువ్వు అనవసరంగా తిరక్కు- అన్నాడట-"

"నీకన్నీ వేళాకోళమే. ఇప్పుడు ఆలయ నిర్మాణానికి వంద రూపాయలు, మనియార్డరు చెయ్యడానికి పది; ఇరవై ఉత్తరాలు పోస్టు చెయ్యడానికి ఇరవై - మొత్తం 130 కావాలి. నా దగ్గిర నూరే ఉన్నాయి. ఓ 30 ఇచ్చి వెళ్లు; అదీ ఇదీ కలిపి ఇచ్చేస్తాను." అన్నాడు సాయిబాబా.

"గోవిందా, వంద రూపాయలు గోవిందా!" అని లేచాను.

"బాగా జ్ఞాపకం చేసేవు. గోవిందరావు ఇవాళే ఎరియర్సు అందుకున్నాడు. అతని దగ్గిర తీసుకోవచ్చు. ఆ కొరదలా ముప్ఫయి రూపాయలూ. పద. నీ సైకిలు మీద నన్ను మన గోవింద రావు ఇంటి దగ్గిర దింపీ!" అని సాయిబాబా లేచేడు.

"నువ్వు గోవిందరావుని 130 అడుగు. నా వంద నాకిచ్చేసి 30 నువ్వు వాడుకో." అన్నాను; గోవిందరావు ఇంటి దగ్గర సైకిలు ఆపి.

"అవునుస్మీ!" అని, ఇంకో వంద రూపాయలు అప్పుచేసే అవకాశం కనబడగానే, ఇంకో వంద రూపాయలు ఇంక్రిమెంటు వచ్చినంత సంతోషపడిపోయాడు సాయిబాబా.

తను ఎందుకు అప్పు అడుగుతున్నాడో ఆ కారణం వివరం సాయిబాబా గోవిందరావుకి చెప్పలేదు. 130 రూపాయలు అప్పు ఇచ్చి మమ్మల్ని గుమ్మందాకా సాగనంపిన గోవిందరావు "ఉండండి, ఇప్పుడే వస్తాను" అని లోపలికెళ్లాడు. అతను తిరిగొచ్చేటప్పటికి నేను సాయిబాబా ఇచ్చిన పది రూపాయల నోట్లు పదీ ఉన్నాయా లేదా అని లెక్కపెట్టడం అవుతోంది, "ఓహో; డబ్బు అవసరం నీకన్నమాట. నువ్వే డైరెక్టుగా నన్ను అడగొచ్చు కదా? ఈ మాత్రం దానికి సాయిబాబా ఇంటిదాకా వెళ్లడం, అతన్ని సైకిలుమీద డబల్సు తొక్కుకుని తీసుకురావడం, మళ్లీ అతన్ని ఇంటిదగ్గిర దింపడం - హుఁ - ఎవడు చెప్పిన పని, ఇదంతా?" అని గోవిందరావు నా మీద నోరు పారేసుకున్నాడు. ఎంత చెప్పినా నమ్మలేదు.

రావికొండలరావు తెలుగుమేష్టారి పాత్రలో ఇలాటిదే ఒక జోకు వుంది. తెలుగు మేష్టారు ఇంగ్లీషు మేష్టారిని ఓ యాభై అప్పు అడిగాట్ట. ఇస్తానని ప్రామిస్ చేసి, రేపు ఉదయం రమ్మన్నాట్ట. ఉదయం వెళ్తే సాయంత్రం రమ్మన్నాట్ట; మళ్లీ మర్నాడుదయానికి, మర్నాడు సాయంకాలానికి

వాయిదా వేసేడట. నాలుగోసారి వెళ్లినపుడు తెలుగు మేష్టారికి వోర్పు చచ్చి "ముష్టి యాభైరూపాయల కోసం ఎన్నిసార్లు తిప్పుతావు? అంత లేనివాడివైతే ఇచ్చుకోలేనని చెప్పలేకపోయావా?" అంటూ జనాల్ని పోగేసి తిట్లకి లంకించుకున్నాట్ట. జనం అంతా ఇంగ్లీషు మేష్టారే ఇతనికి బాకీ అనుకుని "ఇచ్చీవయ్యా, పాపం ఎన్నిసార్లని తిరుగుతాడు ఆయన?" అని నచ్చజెప్పేశారుట.

గోవిందరావు నాకు క్లాసు తీసుకోవడం అయిపోగానే సాయిబాబా చేతికి ఒక మనియార్డరు ఫారమూ 35 రూపాయలూ ఇచ్చేడు. "రేపు నేనూళ్లో వుండను. ఈ ఎం.వో. రేపు కట్టీ" అన్నాడు. మనియార్డరు ఫారంమీద అవతలివాళ్ల ఎడ్రస్ అచ్చువేసి ఉంది. "ఇదేంటి?" అని అడిగాను. గోవిందరావు ఒక అచ్చువేసిన కరపత్రం ఇచ్చేడు.

ఫలానా ఊళ్ళో సాయిబాబా గుడి కట్టేరుట. విగ్రహ ప్రతిష్ఠాపన కూడా అయిందిట. నిర్వహణ ఖర్చుల నిమిత్తం తృణమోపణమో కట్టమని ప్రార్థిస్తూ ఆలయ కమిటీ వారు ఆ పాంప్లెట్ వేశారు. "ఈ పాంప్లెట్ అచ్చు వేసినందుకు, మనియార్డరు ఫారం కొన్నందుకూ, ఫారం మీద మా కమిటీ అడ్రస్ అచ్చు వేయించినందుకూ ఆలయ నిధుల్లోంచి కొంత ఖర్చు చేయడమైంది. కనుక మీరు 116 నుండి 2 రూపాయల వరకు ఎంత పంపినా సంతోషమే" అని ఉంది అందులో.

"నయమే. పాంప్లెట్ పోస్టులో పంపినందుకు రూపాయి తప్పని సరిగా కలపమని అన్లేదు" అన్నాను.

"ఫాంప్లెట్ పోస్టులో రాలేదు. ఇందాక నేను స్కూటర్ మీద వస్తూవుంటే ఎర్రలైటు పడిందని ఆశీలుమెట్ట జంక్షన్ దగ్గిర ఆగినప్పుడు ఒకాయన నా జేబులో పెడుతూ - ఇంటికెళ్లి చదువుకోండి అని చెప్పేడు!"

ఆ అయిదోరోజున సాయిబాబా కొడుకు దస్తూరీతో నాకు నాలుగు పేజీల ఉత్తరం వచ్చింది - అదే గంధర్వ కన్య, శాపం, మానవ జన్మ, హత్య, గుడి, వంద రూపాయలు చందా కట్టకపోతే మా కుటుంబం సర్వనాశనం అయిపోయే ప్రమాదం - అదంతానూ. ★

# 60. జెయిలు కెళ్లని పుస్తకం

"ఏమండీ, మీకు విజయవాడ నుండి ఫోన్" అని చెప్పేసి తుర్రుమంది ఎదురింటివాళ్ల చిన్నపాప. దాంతో - సిరికింజెప్పక శంఖచక్రయుగమున్ చేదోయి సంధింపక - అన్నట్టు లుంగీ సద్దుకున్నా చొక్కా గుండీలు మాత్రం ఎగుడుదిగుడుగా పెట్టేసుకుని ఎదురింటికి పరుగెత్తాను.

"నేనూ! సదాశివరావుని! బావున్నావా?"

"ఆ, థేంక్యూ, చెప్పు చెప్పు; ఏమిటి అర్జెంటు?"

"అర్జెంటని ఎవరన్నారు? ఇవాళ ఉదయమే వచ్చాను. సాయంకాలం ఖాళీ ఉంటే రాకూడదూ?"